www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 నవంబర్ 2023

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రోహిత్ ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఏపి మోడల్ స్కూల్లో విద్యనభ్యసిస్తున్న ఇ.రోహిత్ సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొని జాతీయ స్థాయి అండర్-19 సాఫ్ట్ బాల్‌కు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాల శేఖర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రోహిత్ త్వరలో జాతీయ స్థాయిలో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రానిస్తే ఉద్యోగ అవకాశాలలో ఉంటాయని తెలియజేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రోహిత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

రోహిత్‌తో పీడీ నీలకంఠారావు

కొనసాగుతున్న వర్షాభావం

జిల్లాలో తీవ్ర వర్షాభావం కొనసాగుతోంది. జిల్లాలోని 36 మండలాల్లో భారీగా లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలో ఎక్కడ సాధారణ వర్షపాతం నమోదైన దాఖలాల్లేవు. దీనికి పైపెచ్చు అక్టోబర్‌లో డ్రైస్పెల్ నమోదు కావడం రబీ సీజన్ సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయని చెప్పవచ్చు. ఈలెక్కన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లు వరుసగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో 87 శాతం విస్తీర్ణంలో విత్తనం పడని పరిస్థితి కనిపిస్తోంది.

పొంచి ఉన్న డ్రైస్పెల్ గండం

రబీ సాగు 48,505 ఎకరాలే

జిల్లాలో 13.4 శాతమే సాగు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో రబీ సీజన్ కళ కంచికి చేరినట్లు కనిపిస్తోంది. 2022-23 రబీలో 3,72,050 ఎకరాల్లో సాగు చేయాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. అక్టోబర్ ఒకటి నుంచి డిసెంబర్ వరకు విత్తనం వేయాల్సి ఉంది. అక్టోబర్, నవంబర్ మాసాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. అక్టోబర్ నుంచి నేటి వరకు 7.8 శాతానికి మించి వర్షపాతం నమోదు కాని నేపథ్యం విస్మయాన్ని కలిగిస్తోంది. రబీ సీజన్ ప్రారంభం నుంచి నేటి వరకు 48,505 ఎకరాల్లోనే విత్తనం పడినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. గడిచిన ఐదేసమయానికి సుమారు 70 వేల ఎకరాల్లో విత్తనం పడినట్లు తెలుస్తోంది. ఈలెక్కన జిల్లాలో మరో 3,23,545 ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉంది. ఈలెక్కన రబీ సాగు తీరుతెన్నులను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది.

భయపెడుతున్న డ్రైస్పెల్

జిల్లాలో డ్రైస్పెల్ గండం పొంచి ఉంది. అక్టోబర్ మాసంలో 23.6 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఆశించిన వర్షపాతం నమోదు గాకపోవడం గమనార్హం. రబీ సీజన్ ప్రారంభ మాసమైన అక్టోబర్‌లో తొలి డ్రైస్పెల్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లోనూ ఇదేతరహా పరిస్థితి ఎదురైన సంగతి తెలిసిందే. డ్రైస్పెల్ నమోదైన అనంతరం 7.8 శాతం మాత్రమే వర్షపాతం నమోదు కావడం గమనార్హం. రబీ సాగులో ప్రాధాన్యత కలిగిన నవంబర్ మాసంలోనూ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నవంబర్‌లో 118 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, రెండవ వారంలోకి చేరుతున్న నేపథ్యంలో 7.7 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదు కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. డిసెంబర్ నెలాఖరు వరకు నమోదు కానున్న వర్షపాతం తీరుతెన్నులు సాగు లక్ష్యాన్ని నిర్దేశించనుంది. రబీ సీజన్ ఆందోళనకర స్థాయిలో లోటు వర్షపాతం నమోదు కావడం రైతాంగాన్ని నిరాశ ఆవరించింది. జిల్లావ్యాప్తంగా తీవ్ర దుర్భిక్ష వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో రబీ సీజన్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పాలకులకు కనిపించని కరువు

జిల్లాలో 17 మండలాల్లో కరువు తాండవం చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ మొదలుకుని రబీ సీజన్ మధ్యస్థ దశ వరకు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం జిల్లాలోని 36 మండలాల్లో 17 మండలాల్లో కరువు పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నట్లు పాలనకు అందజేసింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఆలస్యంగా మేల్కొంది. కడప జిల్లాలో ఏ ఒక్క మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. రబీ సీజన్ ప్రారంభమై రెండో నెల గడుస్తున్నప్పటికీ ఖరీఫ్ తరహా దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

రబీ సాగుపై నీలినీడలు

రబీ సీజన్‌లోని 20 రకాల పంటలు సాగవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఏఒక్కటీ పూర్తి స్థాయిలో సాగుకు నోచుకునే అవకాశాలు లేవనే సందేహం కలుగుతోంది. చివరికి వర్షాధార పంటలైన కొర్రలు, అరికెలు, సోమలు, వరిగ, ఊదలు వంటి సిరిధాన్యాలపై సందేహాలు ముప్పిరిగొనడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిల్లా సాగు విస్తీర్ణమైన 3,72,505 ఎకరాల సాగు లక్ష్యంలో ప్రధాన పంటలైన వరి 26,673 ఎకరాలు, బుడ్డశనగ 2,32,360 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 3,352 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడినట్లు తెలుస్తోంది. జొన్న 10,145 ఎకరాలు, వేరుశనగ 1755 ఎకరాలు, మినుములు 30,677 ఎకరాల్లో సాధారణ సాగుకు నోచుకోవడం గమనార్హం. ఇందులో మినుములు సాగు మాత్రమే లక్ష్యానికి మించి 122 శాతం సాగు కావడం గమనించాల్సిన విషయం.

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తాం

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆశిస్తున్నాం. నవంబర్‌లో వర్షపాతం నమోదును బట్టి సాగు పరిస్థితిని అంచనా వేయవచ్చు. ఇప్పటికి 13.4 శాతం విస్తీర్ణంలో మాత్రమే విత్తనం పడింది. డిసెంబర్ నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమిస్తామనే ధీమాను వ్యక్తం చేయడం గమనార్హం.

- నాగేశ్వరరావు, అగ్రికల్చర్ జెడి. కడప.

ఆర్‌డి బదిలీ యత్నం!

- చక్రం తిప్పుతున్న రాష్ట్ర ఉన్నతాధికారి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ రత్నకుమారి బదిలీ కానున్నారా అంటే అవుననే సమాధానమే లభిస్తోంది. ఈమెను బదిలీ చేయించడానికి రాష్ట్ర కేంద్రానికి చెందిన ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఇటీవల ఆయన కడప, తిరుపతి పర్యటనల సందర్భంగా మంత్రాంగం నెరపినట్లు తెలిపింది. ఈనెలాఖరులో రిటైర్డు కానున్న నేపథ్యంలో జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖపై పట్టు పెంచుకునే ప్రయత్నంలో భాగంగా ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్‌డి సైతం ఆరోగ్య కారణాల రీత్యా విశాఖపట్నం రీజినల్ డైరెక్టర్‌గా బదిలీకి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె స్థానంలో కర్నూలు జిల్లాకు చెందిన ఉన్నతాధికారిని రీజినల్ డైరెక్టర్‌గా నియమించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. రిటైర్డ్ అనంతరం వైద్య ఆరోగ్య శాఖపై తనదైన పట్టు సడలకుండా ఉండాలనే ఉద్దేశంతో వ్యవరిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఇటీవలి కౌన్సెలింగుల్లో చోటుచేసుకున్న గైడ్‌లెన్స్ ఉల్లంఘనల్ని సైతం చూసీచూడనట్లు వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. బదిలీ యత్నంపై ఆర్‌డిని సంప్రదించగా తలూపుతూనే ఇది తన పర్సనల్ వ్యవహారమని ముక్తాయింపును ఇవ్వడం గమనార్హం. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇటువంటి అపసవ్య ధోరణులపై మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

నిరుపయోగంగా నీటి శుద్ధి జల కేంద్రం

రూ.8 లక్షల ప్రజాధనం వృథా

ప్రజాశక్తి - వీరబల్లి

కాలక్రమేనా వర్షాభావం నెలకొనడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. అడుగంటిన నీరు క్లోరైడ్‌తో కలుషితం అవుతుండడంతో ప్రజలు ఆ నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని డి. రాచపల్లి పంచాయతీ పెద్దమాదిగపల్లెలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ సిద్ధవటం నాగులమ్మ తనయుడు రవి, వంగిమళ్ల సర్పంచ్ ఎర్రపరెడ్డి సరస్వతమ్మ తనయుడు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మినరల్ ప్లాంట్‌ను రూ.8 లక్షలతో మంజూరు చేయించారు. అనంతరం స్థలం ఏర్పాటు చేసి బోరు వేసి నీటి శుద్ధ జల కేంద్రం కట్టించి ప్రారంభించారు. ఇంతవరకూ ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. గతంలో గ్రామస్తులు నీటి శుద్ధ జల కేంద్రాల నుంచి ట్యాంకర్లతో తీసుకొచ్చిన నీటిని 15 లీటర్ల నీరు రూ.10 కొనుగోలు చేసి తాగేవారు. ఇప్పుడు మన గ్రామానికి నీటి శుద్ధ జల కేంద్రం వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. కానీ జల కేంద్రం ప్రారంభించిన రోజు నుంచి ఇప్పటివరకు నీటి చుక్క కూడా రావడం లేదు. దీంతో ఆ సంతోషం ప్రజల్లో ఆవిరైపోయింది. కాంట్రాక్టర్లు బోరులో నాసిరకం మోటర్ వేయడం వల్ల పది రోజులకు ఒకసారి చెడిపోతుంది. ప్రభుత్వం మోటార్ గురించి పట్టించుకున్న పాపను పోలేదు. గతంలో గాలివాన రావడంతో నీటి శుద్ధ జల కేంద్రం 2000 లీటర్ల ట్యాంక్, పైపులు విరిగిపోయాయి. అధికారులు కానీ, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. లక్షలు విలువ చేసి సామగ్రి అంత నిరుపయోగంగా మారి, పరికరాలు పాడవుతున్నాయని , ప్రజలు పాలకులను, ప్రభుత్వాలకు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అవకాశంగా భావించిన ప్రయివేట్ వ్యక్తులు మినరల్ ప్లాంట్ ద్వారా లక్షలు సంపాదిస్తున్నారు. గ్రామస్తులు తాగునీటి కోసం కోసం పక్క గ్రామాల్లో ఉన్న మినరల్ ప్లాంట్ వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్పందించి ప్రభుత్వం సొమ్మును దుర్వినియోగం చేయకుండా తిరిగి నీటి శుద్ధ జల కేంద్రం ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి జల కేంద్రం భవనం



పనిచేయని మంచినీటి బోరు మోటర్

గ్యాస్ కనెక్షన్లు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- రామాపురం

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ఇండియన్ గ్యాస్ కనెక్షన్లను నిరు పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ గ్యాస్ యజమాని సి.వి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠారావుపేటలో సోమవారం ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంతవరకు గ్యాస్ కనెక్షన్ లేని పేదలు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి యోజన ఉజ్వల యోజన పథకం కింద పేదలకు ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల మైనార్టీ టిడిపి నాయకుడు, నీలకంఠరావుపేట గ్రామ ఉపసర్పంచ్ ఎస్.మహబూబ్ బాషా, రవి, వంశీ, రేష్మ, సభిరా, ముబినా, తహసిక్, షేక్ రహమతున్నషా, షహిన, సర్దార్ నిషా, బి శ్రావణి, బి. రెడ్డమ్మ, షఫీ ఉల్లా, తహర్ వల్లి పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు మల్లయ్య కొండపై కేదారేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించి నోములు నోచుకున్నారు. పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయానికి వెలుపల వెలిసిన గౌరమ్మ తల్లి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి శేఖర్, విజయ నిర్మల దంపతులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహి స్తామని అధికారి జిలానిబాషా పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, చిత్రలేఖనం, వృత్యత్వం, ముగ్గులు, మ్యూ జిక్ చైర్స్ వంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ముగింపు రోజు విద్యార్థులకు బహుమతులు అందజేస్తారని గ్రంథాలయ అధికారి జిలాని భాష తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిలాని

సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని 20వ వార్డులు సమస్యల పరిష్కాన్ని కృషి చేస్తానని రాష్ట్ర వైసిపి నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో ఆయన విస్తృతంగా పర్యటించారు. ముస్తాబా మసీదు వీధిలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం సింగపూర్ లైన్, ఎన్‌జిఒ కాలనీ, దర్గా వీధిలో ఉండే పలు సమస్యల గురించి మహిళల ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాయచోటిని అభివృద్ధి చేయాలనే కోట్లాది రూపాయలు నిధులు కేటాయించారని తెలిపారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి ఆదేశాల మేరకు దుర్గా వీధిలో రూ.20 లక్షల వ్యయంతో రాబోయే రోజుల్లో సిసి రోడ్డు నిర్మిస్తానని వారికి చెప్పారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ సుదర్శన్, పీడీ నరేంద‌ర్‌రెడ్డి, యోగాంజినేయాలు, పొట్టిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్‌రెడ్డి, కత్తి వెంకటరామిరెడ్డి, నాగేశ్వర, ముత్యాల దేవి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బస్సులు ఒకే రూట్‌లో నడపాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ నుంచి సుండుపల్లె, రాజంపేట వైపు తిరిగే ఆర్టీసీ బస్సులు ఒకే రోడ్డు మీదుగా నడపడానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రయాణికులకు కష్టాలు తొలగించాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. మొదటి నుంచి రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ నుంచి సుండుపల్లె, రాజంపేట వైపు తిరిగే ఆర్టీసీ బస్సులు ఠాణా, ఆర్టీసీ డిపో, చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు సర్కిల్ మీదుగా నడిచేవని తెలిపారు. తర్వాత రాయచోటి ఠాణా ప్రాంతం నుంచి చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు మొదలు కావడంతో ఆ రోడ్డులో బస్సులు తిప్పడానికి అంతరాయం ఏర్పడిందన్నారు. తర్వాత ఆర్టీసీ బస్టాండ్, బంగ్లా (క్లబ్) సర్కిల్, గున్నికుంట్ల రోడ్డు క్రాస్, రింగ్ రోడ్డు పైన, గున్నికుంట్ల సర్కిల్, చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు సర్కిల్ మీదుగా చాలా రోజులుగా ఆర్టీసీ వారు సుండుపల్లె, రాజంపేట వైపు వెళ్లే బస్సులు నడిపారని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని బస్సులు ఆ మార్గాన కాకుండా బంగ్లా, ఠాణా,మాసాపేట, వీరబల్లి రింగ్ రోడ్డు సర్కిల్ , చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు సర్కిల్ మీదుగా, మరికొన్ని బస్సులు బంగ్లా, పీలేరు రింగ్ రోడ్డు సర్కిల్, చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు సర్కిల్ మీదుగా నడుపుతున్నారని తెలిపారు. రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ నుంచి సుండుపల్లె, రాజంపేట వైపు తిరిగే ఆర్టీసీ బస్సులన్నిటినీ ఒకే రూట్‌లో నడపాలని, ఆ రూట్ వివరాలు పత్రిక ప్రకటన ద్వారా ప్రయాణికులందరికీ తెలియజేయాలని, ప్రయాణికుల కష్టాలు తొలగించాలని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని బండపల్లి ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సోమవారం లయన్ క్లబ్ ఆధ్వర్యంలో పేరం ఇరగంరెడ్డి తన తల్లి పేరం నాగులమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేయడానికి ఇక ముందు తన వంతు సహాయ సహకారాలు అందిస్తాననని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రాయచోటి అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, నాగులమ్మ కోడలు సుజాతమ్మ, మనవడు విశ్వ కిరణ్ రెడ్డి, కుమార్ రెడ్డి, కూతురు విజయలక్ష్మి, అల్లుడు భయా రెడ్డి, ప్రేమాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కార కార్యక్రమంలో వాసవి క్లబ్ నిర్వాహకులు

వాసవి క్లబ్‌కు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి-పీలేరు

2023 సంవత్సరానికి పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్‌లకు 13 వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సేవా పురస్కారాలు అందాయని వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షులు జూటూరు అరవింద్ తెలిపారు. ఆదివారం మదనపల్లి శ్రీరామ తులసి కళ్యాణ మండపంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి-211ఎ గవర్నర్ హనీషా డిస్కాన్ చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం పీలేరులో అరవింద్ మాట్లాడుతూ తమ క్లబ్బులకు ఉత్తమ క్లబ్, ఉత్తమ అధ్యక్షుడు, ఉత్తమ డ్రెస్ కోడ్, సూపర్ ఎక్సెలెన్సీ, ఉత్తమ బ్యానర్ ప్రెజెంటేషన్ అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. 2023 సంవత్సరంలో 130 సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి పరిధిలోని 20 మంది క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నామన్నారు. వారికి 6 నెలల పాటు పౌష్టిక ఆహారాన్ని అందించామని చెప్పారు. పట్టణానికి నాలుగు వైపులా ఉన్న రహదారుల ప్రక్కన స్వాగత బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా పలు సేవా కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి వాసవి క్లబ్స్ సభ్యులు, మాజీ అధ్యక్షులు అయితా రాములు, బాలాజీ, కృష్ణమూర్తి, సురేష్, ఇస్సా నాగలక్ష్మి, జిల్లా గవర్నర్ మహీధర్, వి.వెంకటేష్, కార్యదర్శి ప్రభాకర్ రావు, కోశాధికారి శివప్రసాద్, పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షులు జె.అరవింద్, కార్యదర్శి శివఫణేష్, కోశాధికారి గోవర్ధన్, వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షులు మహీదర, కార్యదర్శి సురేష్, ట్రెజరర్ శంకర్ నాథ్ సభ్యులు పాల్గొన్నారు.

దాచుకున్న సొమ్ము దోచుకుంటున్న ప్రభుత్వం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉపాధ్యాయులు ప్రావిడెంట్ ఫండ్ రూపంలో దాచుకున్న డబ్బులను ప్రభుత్వం దోచుకుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు సోమవారం యుటిఎఫ్ భవన్‌లో ప్రాంతీయ మండలాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి రాకముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ ప్రతి రూపాయి సకాలంలో చెల్లిస్తామని హామీలు గుప్పించారని తెలిపారు. అధికారం చేపట్టాక ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ప్రభుత్వంలో భాగం కాదనే విధంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్య, వైద్యం, వ్యక్తిగత అవసరాల నిమిత్తం ప్రతినెలా జీతంలో పొదుపు రూపంలో దాచుకున్న పిఎఫ్ సొమ్మును ప్రస్తుతం అనారోగ్యం ఇతరత్రా సమస్యల కారణంగా వాడుకోవడానికి అవకాశం లేకుండా గత మార్చి నుంచి ఒక్క రూపాయి కూడా విదల్చకుండా ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల దారుణంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఏపీ జిఎల్ఐ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు పూర్తిగా అందని ద్రాక్ష లాగా మారిపోయాయని తెలిపారు. దసరా, దీపావళి సందర్భంగానైనా వాటిని మంజూరు చేస్తారని కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూసిన ఉపాధ్యాయులు బకాయిలు రాకపోవడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ సొమ్ములను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమ కార్యాచరణ చేపట్టి ప్రభుత్వం మెడలు వంచైనా తమకు రావాలసిన న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి పోరాట పంథాను ఎంచుకుని సాధించుకుంటామన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పీలేరు

మాలమహానాడు 25వ వార్షిక విజయోత్సవ మహాసభను జయప్రదం చేద్దామని మండల మాలమహానాడు నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పీలేరు మాలమహానాడు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బొడుమల్లువారిపల్లి పంచాయతీ దళితవాడలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పాలకులు చేసిన విభజన కుట్రను పసిగట్టి దాన్ని వ్యతిరేకించి, 1997లో పివి రావు మాలమహానాడు ఏర్పాటు చేశారని, ఈ నెల 19న ఆదివారం ఉదయం 10 గంటలకు సిఎస్ఐ.జెఎస్ఎం వేదికగా మదనపల్లిలో జరిగే మాల మహానాడు విజయోత్సవ మహాసభకు ముఖ్య అతిధులుగా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ దళితరత్న డాక్టర్ యమలా సుదర్శన్ హాజరవుతారని, ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలోని మాలలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, డిబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాష్, మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్, మండల ప్రధాన కార్యదర్శి గుండ్లూరు రవీంద్ర, సభ్యులు నాగేంద్ర, మహేష్, సీనియర్ దళిత నాయకులు ఆర్.ద్వారక, ఆర్.సత్యనారాయణ, శ్రీధర్, లావణ్య, అక్కయ్య, రమణమ్మ, సరస్వతి రాజమ్మ, ఉదయ్ కుమార్, నాగరాజ, మల్లికార్జున, కృష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు దీపావళి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. గత రెండు రోజులుగా కొనుగోలు చేసిన బాణా సంచాలు కాలుస్తూ పిల్లలు పెద్దలు ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు మహిళలు ఆదివారం ఉదయం తలంటి స్నానాలు చేసి కొత్త దుస్తులు ధరించి, అమావాస్య సాయంకాలం లక్ష్మీదేవికి వివిధ రకాల పిండి వంటలను సమర్పించి పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటిలో దీపాలు, రంగురంగుల ఎల్ఇడి కాంతిలతో దేదీప్యమానంగా దీపావళి పండుగను జరుపుకున్నారు. **నిమ్మనపల్లి:** మండల వ్యాప్తంగా దీపావళి పండుగను అంగరంగ వైభవంగా మహిళలు, చిన్నారులు, యువకులు జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో ప్రజలు ఉదయాన్నే అభ్యంగన స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలను ధరించి బంధువుల మధ్య బాణా సంచాను కాల్చి సంబరాలను చేసుకున్నారు. **కలకడ:** మండలంలో వాడవానుల దీపావళి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో దీపావళి పండుగను పురస్కరించుకుని సంబరాన్ని అంబరాన్ని అంటేలా జరుపుకున్నారు. కలకడ: మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. సిఐ నాగేంద్ర ఆధ్వర్యంలో దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్స్ సునీల్ శశి కుమార్, హరిబాబు, రమేష్ కుమార్, గోపి కృష్ణ, పోలీస్ సిబ్బంది యూనస్, రమేష్, రియాజ్, లక్ష్మీనారాయణ, వలి, కరుణాకర, రామ్మోహన, మహబూబ్ బాషా, ప్రతాప్, సుబ్బయ్య, డ్రైవర్ రమేష్, హోంగార్డు నాగిరెడ్డి పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండలంలో వాడవాడలా దీపావళి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో దీపావళి పండుగను పురస్కరించుకుని సంబరాన్ని అంబరాన్ని అంటేలా జరుపుకున్నారు. **మదనపల్లె :** రూరల్ మండలం అంకిశెట్టిపల్లి వద్దనున్న బుద్ధునికొండపై ధమ్మ దీపావళి వేడుకలు బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ ఉపాసక పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, బాస్ సంస్థల ప్రతినిధులు చాట్ల బయన్న, ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, మలారి గిరిబాబు, సొన్నికంటి రెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, గిన్నెల మనోహర్ రెడ్డి, రాయల్ సూర్య, బురుజు జనార్దన్, శశికుమార్, మను, లోకేష్ పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలో దీపావళిని ఆది, సోమవారాలలో ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు పటాసులను కాలుస్తూ సంతోషంగా దీపావళి జరుపుకున్నారు. **తంబళ్లపల్లి:** మండలంలోని ఊరు వాడలలో దీపావళి పండుగను కనువిందుగా జరుపుకున్నారు. పిల్లలు తలఅంటు స్నానం చేసి టపాకాయలు పేలుస్తూ కేరింతల కొడుతూ ఆనందాన్ని పంచుకున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గంటా నరహరి

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎగువగడ్డ వీధిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ చెత్త బండికి ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో విద్యుదాఘాతానికి మృతి చెందిన శ్రీనివాసులు కుటుంబానికి టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి సోమవారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధితుడి చిన్న కుమారుడి ఉన్నత విద్యకు తన వంతు సహాయ సహకారం అందిస్తానని, బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నగదు అందజేసి అనంతరం గంటా నరహరి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడ లేకపోవడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, పట్టణంలోని అనేక ప్రాంతాలలో ఇదే సమస్య ఉన్నట్లు పారిశుధ్య కార్మికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖ సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

'చమర్తి' పరామర్శ : విద్యుదాఘాతంతో మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు శ్రీనివాసులు కుటుంబాన్ని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్‌రాజు సోమవారం మృక్ష్మితుడి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసి మృతుడు సోదరుడికి తన రాజు విద్యా సంస్థల్లో ఉచితంగా విద్యను అందిస్తానని హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించి వారి సంక్షేమానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పోలి శివకుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి శంకర్ కనీసం విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఇటీవల బడికాయలపల్లిలో బాబు షురిటీ కార్యక్రమంలో భాగంగా పాపాగ్ని నది నుంచి కర్ణాటకకు అక్రమ ఇసుక రవాణా చేస్తూ 1000 కోట్లు సంపాదించారని, హంద్రీ-నీవా కాలువ నుండి కుప్పానికి నీళ్లు తరలించే క్రమంలో కాలువలో గడ్డి చెత్త తొలగించకుండా నీళ్లు వదిలి గండిపడడానికి కారణమయ్యారని, పేర్కొన్నారు. ఎవరో గండి కొట్టిందేది కాదని ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలలో జరగనటువంటి అభివృద్ధిని పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కేవలం నాలుగున్నర సంవత్సరాలలో చేసి చూపించారన్నారు. తంబళ్లపల్లిలో ఏవిధమైన అభివృద్ధి జరిగిందో సరిగ్గా చూస్తే అర్థమవుతుందని చురకలంటించారు. శంకర్ తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆయనను తిరస్కరించిన సంగతి మర్చిపోయారా అని ఎద్దేవా చేశారు. టిడిపి నాయకులు పెద్దిరెడ్డి కుటుంబంపై అర్థరహితమైన ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోకనాటి వీధి యూత్, హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కంచి సురేందర్ రెడ్డి, నాయకులు టి.జనార్ధన్, రెండో సచివాలయం కన్వీనర్ వరప్రసాద్, గౌతమ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ముజా, బాబా పాల్గొన్నారు.

విడదీయడం దుర్మార్గపు చర్య

ప్రజాశక్తి- కలకడ


మాట్లాడుతున్న నాగన్న

మాల, మాదిగలను విడదీయడం దుర్మార్గపు చర్యని మాల మహానాడు జిల్లా కార్యవర్గ సలహా దారులు ఎంపీ నాగన్న విమర్శించారు. సోమవారం మండల కేంద్రమైన కలకడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల విశ్వరూప సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ మాల, మాదిగల విభజన చట్టాన్ని తెస్తానని, వేరు చేస్తారని అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలలో మాలలు, మాదిగలు అన్నదమ్ముల వలే కలిసి ఉన్న విషయాన్ని గుర్తించకుండా వారిమధ్య చిచ్చు పెట్టడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. మాల, మాదిగలను వేరు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు రజనీకాంత్, ఉపాధ్యక్షులు రెడ్డప్ప, కార్యదర్శి ఓబులేసు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాల మేనిఫెస్టోను ప్రజలకు అవగాహన కనిపించాలని ఐటిడిపి ఆధ్వర్యంలో టిడిపి నాయకులకు, బూత్ కమిటీ మెంబర్లకు అవగాహన కార్యక్రమం స్థానిక అమర్నాథరెడ్డి భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు షబ్బీర్ హుస్సేన్, సూర్య ప్రకాశ్‌రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్ వచ్చే ఎన్నికలకు గాను బాబు షురిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఆరు పథకాలను మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, బిసి డిక్లరేషన్, రైతులకు రూ.20 వేలు భరోసా, పూర్‌టురిచ్, విద్యార్థులకు అమ్మబడి వంటి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని వారికి తెలియజేశారు. వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అరా చకాలను, కార్యక్రమాలను కోరారు. కార్యక్రమంలో నాయకులు అగస్త్యేశ్వర్, శ్రీనివాస్ వర్మ, మాజీ జడ్‌పిటిసి మాలతి, మాజీ సర్పంచ్ అంజమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్న టిడిపి

కుక్కలున్నాయి జాగ్రత్త..!

చిన్నారులు, పాదచారులను వెంబడిస్తున్న వైనం - పలువురికి గాయాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు, కుక్కకాటు వేయడంతో పడిన గాట్లు(ఫైల్‌ఫొటో)

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డా వీధి, గూడు మస్తాన్ వలీ దర్గా వీధి, బ్యాంకు కాలనీ, దిగువపట్నం కాలనీ, నెహ్రూ నగర్ కాలనీ, ఎస్‌పిజి క్వార్టర్స్, గంగమ్మ దేవాలయం వెనుక భాగాన ఉన్న వీధుల్లో, బెల్లాల వీధిలో వీధి కుక్కలు, పిచ్చికుక్కలు ఎక్కడపడితే అక్కడ గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల గుంపు వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. వాటిని తరిమేందుకు ప్రయత్నించిన ప్రజలపై, దారిలో సైకిళ్లు, స్కూటర్లపై వెళతున్న వారిపై, పాదచారులను వెంటాడుతూ కరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల జమ్మలమడుగు మున్సిపాలిటీలోని బేపారి వీధి, గడ్డా వీధి, గూడు మస్తాన్ వలి దర్గా వీధుల్లో దాదాపు 10-15 మంది పిల్లలను వీధి కుక్కలు, పిచ్చి కుక్కలు వెంటపడి మరీ గాయపరిచాయి. దీంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రయివేట్ వైద్య శాలల్లో గాయపడిన చిన్నారులను తీసుకొని వారి తల్లి దండ్రులు గుంపులుగా వచ్చారు. ఈ కుక్కల దాడులను తట్టుకోలేక ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి జమ్మ లమడుగు పట్టణంలోని అన్ని వీధుల్లో వీధి కుక్క లు, పిచ్చి కుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.

కిడ్నీ బాగుంటేనే ఆరోగ్యం

- కిడ్నీ చికిత్స నిపుణులు డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మనిషి శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీస్) చాలా ముఖ్యమైన అవయవాలు. మనిషి మనుగడకు మెదడు, గుండె, మూత్రపిండాలు మూలాధారం. అంతటి ప్రాధాన్యత కలిగిన కిడ్నీల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. తద్వారా ఆరోగ్యంగా ఉండాలని ప్రముఖ కిడ్నీ చికిత్స నిపుణులు డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మూత్రపిండాల అవగాహనా దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. మనిషి చేసే కార్యకలాపాలాన్నింటినీ నియంత్రించేందుకు మెదడుతోపాటు శరీరంలోని అన్ని అవయవాలకు రక్తాన్ని ప్రసరింపజేసేందుకు పంప్ వంటి సాధనం గుండె అన్నారు. రక్తంలో చేరుతున్న కల్మషాన్ని(చెడు) గాలించి వడపోసి శుభ్రం చేసే పని మూత్రపిండాలది. మూత్రపిండాలు విరామం లేకుండా పనిచేసి రక్తాన్ని శుభ్రం చేస్తుంటాయన్నారు. ఒక రోజులో మనిషి మూత్రపిండాలు 200లీటర్ల రక్తాన్ని వడ బోస్తాయని అంచనా. ఒంట్లో నీరు-లవణాల సమ తుల్యతను కాపాడడంలో, రక్తపోటును నియంత్రించడంలో ముఖ్య మైన పాత్ర పోషిస్తాయన్నారు. మనం తినే ఆహారం నుండి అనవసరమైన పదార్థాలు కొన్ని రక్తంలో చేరుతాయని వీటినే మలినాలు అంటా మన్నారు. ఇలా రక్తంలో చేరిన మలినాలను కిడ్నీలు శరీరం నుండి బహిష్కరించకపోతే రక్తం విషపూరితం అవుతుంది. ఈ పనిని కిడ్నీలు చేస్తా యన్నారు. మూత్రపిండాలు దెబ్బతినేందుకు నియంత్రణలోలేని మధుమేహం, అధికరక్తపోటు, ఉబకాయం, సైడ్ ఎఫెక్ట్స్ తెచ్చే పెయిన్ కిల్లర్స్ కొంత వరకు వంశపారంపర్యం వంటివి కారణాలుగా ఆయన వివరించారు. అధికంగా వాంతులు, విరేచనాలు అవుతూ ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలన్నారు. అధికంగా మాంసం తినడం వల్ల, వేడి వాతావరణంలో పని చేయడంవల్ల, ఫ్లోరైడ్ సహిత నీళు తాగడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడుతాయన్నారు. రోజుకు 5 నుండి 7లీటర్ల నీరు తాగితే రాళ్లు ఏర్పడే అవకాశం ఉండదని ఆయన సూచించారు. అతిమూత్రం నీరసం, కాళ్లవాపు, నడుంనొప్పి లక్షణాలుగా తెలిపారు. క్రమం తప్పని వ్యాయామం, శరీర బరువును అదుపులో పెట్టుకోవడం, పొగాకు ఉత్పత్తులను వాడకపోవడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి అలవాట్లతో మూత్రపిండాల వ్యాధి నుండి దూరం కావచ్చని డాక్టర్ కృష్ణారెడ్డి సూచించారు.

టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్ నేతృత్వంలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశానంతరం ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఇతర నాయకులు ప్రవీణ్ నివాసానికి రావడంతో పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు చేరుకున్నారు. సంయమనం పాటించాలని ప్రవీణ్ కార్యకర్తలకు సూచించారు. ప్రవీణ్‌రెడ్డితోపాటు టిడిపి నాయకులు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. స్టేషన్ ముందు ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ అక్రమ అరెస్టులో నిర్దోషిగా బయటకు వస్తానని తెలిపారు. 2024 ఎన్నికల్లో రాచమల్లుకే టికెట్ రావాలని కోరుకుంటున్నానని, ప్రజాక్షేత్రంలోనే నువ్వో, నేనో తేల్చుకుందామన్నారు. గత నెలలో వైసిపి వర్గీయుడు బెనర్జీపై ప్రొద్దుటూరు టిడిపి యువత అధ్యక్షుడు భరత్ కుమార్ రెడ్డి, ప్రవీణ్ సమీప బంధువు రామ్మోహన్‌రెడ్డి చేసిన హత్యాయత్నంలో ప్రవీణ్‌రెడ్డిపై 307, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఇంతవరకు ఆయన పరారీలో ఉండడంతో సోమవారం అరెస్టు చేశారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు పూర్తయిన వెంటనే మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని డిఎస్‌పి వంశీధర్ గౌడ్ తెలిపారు.

అరెస్టు సమయంలో పోలీసులతో మాట్లాడుతున్న ప్రవీణ్

ప్రవీణ్‌కు 14 రోజుల రిమాండ్

ప్రొద్దుటూరు : గత నెల 28న బెనర్జీపై జరిగిన హత్యాయత్నం కేసులో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి న్యాయమూర్తి 14రోజులపాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. ఈ కేసులో ఎ3గా ఉన్న ప్రవీణ్ సోమవారం స్వచ్ఛందంగా త్రీటౌన్ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

ఎలా బయటపడాలో మాకు తెలుసు


మాట్లాడుతున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అక్రమ కేసుల్లో ఎలా బయటపడాలో తమకు తెలుసని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి నివాసంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బెనర్జీపై దాడి కేసులో ప్రవీణ్ కుమార్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కావాలనే ఎమ్మెల్యే రాచమల్లు అక్రమ కేసులు పెట్టి ఆయనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి అక్రమ కేసులు ఎలా ఎదుర్కోవాలో తమకు కూడా తెలుసన్నారు. జిల్లాలో ఏ నియోజకవర్గంలో కూడా ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించే ఆనవాయితీ లేదన్నారు. ఒక్క ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాత్రమే కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రవీణ్ ఎమ్మెల్యే చేసే ప్రతి అక్రమ పనికి అడ్డు తగులుతూ ఉండడంతో ఓటమి భయంతోనే అక్రమ కేసులు బనాయి స్తున్నారన్నారు. అనంతరం ప్రవీణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భరత్ తమ్ముడు లాంటి వాడని, రామ్మోహన్ తన బంధువని ఇరువురు టిడిపిలో ఉన్నారన్నారు. భరత్ బెనర్జీని గాయపరచడం యాధృచ్ఛికమన్నారు. ఇది ఆత్మ రక్షణ కోసం జరిగిన దాడి అని తెలిపారు. ఉద్దేశ్యపూర్వకంగానే తనపై తప్పుడు కేసులు ఎమ్మెల్యే పెడుతున్నారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తి లేదన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో బెనర్జీ నిందితుడని, గతంలో వైసిపి నాయకులను బెదిరించాడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవ గుడి నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, బండి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణ జలాల కేటాయింపులో తీరని అన్యాయం

- కేంద్రం చేసిన చట్టంతో 'సీమ' ఎడారి : విరసం వరలక్ష్మి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ లబ్ధి కోసం అక్టోబర్ 2న ఒక చీకటి చట్టాన్ని తీసుకొచ్చాయని, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కృష్ణ జలాల కేటాయింపులో తీరని నష్టం చేకూరే ప్రమాదం ఉందని విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి తెలిపారు. సృజన సామాజిక కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీమను ఎడారి చేసే చీకటి చట్టం పేర రాయలసీమ విద్యావంతులు వేదిక వేసిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా రాయలసీమకు చాలా అన్యాయం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నీటిని ప్రాజెక్టుల వారీగా కాకుండా ఏక మొత్తంగా తీసుకొని రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి పంపకం చేయాలనే అంశాన్ని బ్రిజేష్‌కుమార్ మిశ్రాకు అప్పగించారన్నారు. గోదావరి జలాలను పోలవరం ద్వారా కృష్ణ డెల్టాకు మళ్లించడం ద్వారా ఆదా అయ్యే కృష్ణ జలాలను రెండు తెలుగు రాష్ట్రాల అవసరాలకు పంచే అంశాన్ని రాజేష్‌కుమార్‌కు కేంద్రం అప్పజెప్పిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భవిష్యత్తులో గోదావరి జలాలను కృష్ణ నదికి మళ్లించడం ద్వారా ఆదా అయ్యే జలాలను రెండు రాష్ట్రాలకు పంచాలన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం తమ ప్రాంతంలోని కృష్ణ నది మీద ఆధారపడిన ప్రాజెక్టులకు గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఆదా అయ్యే కృష్ణ జలాలను రెండు రాష్ట్రాలకు పంచే అంశం మాత్రం ఈ చట్టంలో చేర్చలేదన్నారు. తద్వారా రాయలసీమకు ఉన్న మిగులు జలాల మీద ఆధారపడిన ప్రాజెక్టులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తూ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా పోరాడాలసిన ఆవశ్యకత ఉందన్నారు. కరపత్రాలు పట్టణంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక కో-కన్వీనర్ ఎస్పీ మహమూద్, సృజన సామాజిక వేదిక శ్రీనివాసులురెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు తవ్వా సురేష్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఆర్వీఎస్ కన్వీనర్ హరిత, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న వరలక్ష్మి, తవ్వా సురేష్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు 56వ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ అధికారి జె శివశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ఉద్యమకారులకు నివాళులర్పించడం, 17న విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. హార్మోనియంపై సంగీతంలోని సరిగమలు నేర్పిస్తామన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముగింపు రోజున పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-నందలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ష్యూరిటీ అని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం భవిష్యత్తుకు గ్యారెంటీ ఇది బాబు ష్యూరిటీ అనే కార్యక్రమాన్ని లేబాక గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తానే తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లల్ని చదివించినా అంతమందికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందిస్తామన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500, జిల్లా వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, యువగళం నిధి కింద నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, అన్నదాత పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు, కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య, నాయకులు శ్రీరాములు, పెద్దవెంకటసుబ్బయ్య, నాగి వెంకటరమణ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నవజీవన్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-బి.కొత్తకోట/మదనపల్లె

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ గంగోత్రి మలుపు వద్ద బైకు బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు... మదనపల్లి పట్టణం తూర్పు కొత్తపేటకు చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్ చిన్నకుమారుడు నవజీవన్ (16) స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి హార్సిలీహిల్స్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సోమవారం ఉదయం గంగోత్రి మలుపు వద్దకు రాగానే నవజీవన్ బైక్ అదుపుతతప్పి ప్రక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో నవజీవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన నవజీవన్ భౌతిక కాయం వద్ద మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్ బాషా, దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, టిడిపి నాయకులు శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

ప్రజాశక్తి- కలకడ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కదిరాయ చెరువు పంచాయతీ వడ్డిపల్లికు చెందిన పూజారి నడిపి రెడ్డప్ప కుమారుడు పూజారి సుబ్బరాజు (45) తన ద్విచక్ర వాహనం టివిఎస్ వాహనంలో తన గ్రామం వడ్డిపల్లి నుండి కదిరాయచెరువు కు వస్తున్న క్రమంలో గుర్రంకొండ వైపు నుండి వస్తున్న లారీ సుబ్బరాజు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొంది. లారీ డ్రైవర్ సయ్యద్ సద్దాం హుస్సేన్ అజాగ్రత్తగా, అతివేగంగా లారీని నడుపుతూ సుబ్బరాజు ప్రయాణిస్తున్న ద్విచక్ర ఢీకొనడంతో గాయాలు పాలైన అతనిని తన బంధువులు కలకడ 108 వాహనంలో మదనపల్లెకు చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు.108 వాహనంలో మదనపల్లికి తీసుకుని వెళ్ళగా అక్కడి వైద్యులు పరీక్షించి క్షతగాత్రుడు మృతి చెందినట్లు తెలిపారున్నారు. సుబ్బరాజు రోడ్డు ప్రమాదంలో చెందిన విషయం తెలుసుకున్న ఎస్సై తన సిబ్బందితో మదనపల్లికి వెళ్లి పోస్టుమార్టం గావించి మృతదేహాన్ని బంధువులకు అంపొగించడం జరిగిందని తెలిపారు. మేరకు మృతుడు సుబ్బరాజు చిన్నాన్న కుమారుడు రెడ్డప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మంగళవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సిఐ నరసింహారావు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పారిశుధ్య పనులకు వెళ్లిన శ్రీనివాసులు(18) మంగళవారం తెల్లవారుజామున ఎగువగడ్డవీధిలో చెత్త సేకరిస్తుండగా అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెత్త బండి డోర్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు పంచనామా నిమిత్తం మృతుడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, పురపాలక చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి మృతదేహాన్ని సందర్శించి బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి ఓదార్చారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉన్న ట్రాన్స్‌ర్మర్లకు రక్షణ గోడ నిర్మించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు.

నాటు తుపాకీ స్వాధీనం - నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - రామాపురం

మండల పరిధిలోని పాలకొండలో శ్రీగంధం మొక్కలను నరికి తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు వంగిమల సెక్షన్ ఆఫీసర్ భరణి కుమార్ తెలిపారు. రాయచోటి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆదేశాలు మేరకు ఆదివారం పాలకొండ వంగిమల సెక్షన్ పరిధిలోని సరస్వతి పల్లి బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా వేణుమాకుల గరువు ప్రదేశంలో నలుగురు శ్రీగంధం మొక్కల జిగురు తీస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో రాచపల్లి పంచాయతీ గంగనేరుకు చెందిన మల్లిక రమణ,. మల్లికా హరికృష్ణ, గువ్వల చెరువు పంచాయతీ రెడ్డివారిపల్లి చెందిన వీర నాగయ్య, నీలం రవీంద్రను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు శ్రీగంధం మొక్కలను నరికి 37 కేజీల చెక్కలను తరలించడానికి సిద్ధమవుతుండగా పట్టుకున్నామని తెలిపారు చెక్కల విలువ సుమారు లక్ష పైబడి ఉంటుందని పేర్కొన్నారు. వారి వద్ద అడవి పందులను చంపి తినడానికి ఉపయోగించే నాటు తుపాకీ ఉండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని లక్కిరెడ్డిపల్లి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచగా జుడిషియల్ రిమాండ్‌కు రాయచోటి సబ్ జైలుకు తరలించినట్టు తెలిపారు. కూంబింగ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ఆర్.రెడ్డప్ప, మహబూబ్ బాషా, కార్తీ బేస్ క్యాంప్ ప్రొటక్షన్ వాచర్లు నాగ శేషు, గురయ్యా, జయరామ, రమణ, రెడ్డయ్య, శీను, గోపాల్, సుబ్బారెడ్డి, చిన్న రెడ్డయ్య భాష పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు